సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ల అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎంపీ శ్రీ భరత్, విప్ గణబాబు

గోపాలపట్నం: నియోజకవర్గంలోని పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌లను ఆదివారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గణబాబు అందజేశారు. విప్ గణబాబు మాట్లాడుతూ అనారోగ్యంతో వైద్య చేయించుకున్న నియోజకవర్గంలో 19 మందికి సుమారు రూ.28లక్షలు అందించామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొమ్మిడి రమణ, డి. రమేష్‌నాయుడు, నాయకులు సత్తిరాజు, బొడ్డేటి విజయ్, యముజల తిరుమలరావు, యలమంచిలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక దర్శనాలు కల్పించారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

ఏయూ యోగా జట్టు ఎంపిక



పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఆచార్య విజయమోహన్ తదితరులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ పురుషులు, మహిళల యోగా జట్ల ఎంపిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఏయూ దూరవిద్యా కేంద్రం డైరెక్టర్, వ్యాయామ విద్యా విభాగం డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయమోహన్ క్రీడాకారులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆల్ ఇండియా యూనివర్సిటీ యోగా పోటీలు భువనేశ్వర్‌లోని కిట్స్ యూనివర్సిటీలో ఈ నెల 24 నుంచి 28 వరకు జరుగుతాయన్నారు. వివిధ ఆసనాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను విజయమోహన్, ఏయూ వ్యాయామ విద్యా విభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి అభినందించి యోగాలో ప్రతిభ సాధించి వర్సిటీకి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. యోగా కోచ్ వర్మ తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.

రక్షణగిరిలో దీపారాధన



దీపారాధనలో పాల్గొన్న మహిళలు

కంచరపాలెం: జ్ఞానాపురం పునీత పేతురు చర్చి ఫాదర్ రెవరెండ్ జొన్నాడ జాన్‌ప్రకాష్, పారిస్ పాస్టిల్ కౌన్సిల్స్ (పీపీసీ) సంయుక్త ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం 4 గంటలకు కొవ్వొత్తులతో జ్ఞానాపురం వీధుల్లో ప్రదక్షిణలు చేశారు. సెబాస్టియన్ కాలనీ, బాబూ కాలనీ, జీఎస్ఎస్‌యూఆర్ఎం కాలనీల్లో మహిళలు కొవ్వొత్తులతో ప్రదర్శనలు నిర్వహించారు. క్రీస్తు రాకకోసం ప్రజలు భక్తి శ్రద్ధలతో మెలగాలన్నారు. నవ దినాలు జరిగే దీపారాధనల్లో అన్ని గ్రామాల భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు, అధిక సంఖ్యలో క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌కు కళ్లెం వేసేలా...



క్యాన్సర్.. ఈ పేరు వింటేనే కాళ్లు, చేతులు వణుకుతాయి.. చాపకింద నీరులా విస్తరించే క్యాన్సర్‌ను ఆలస్యంగా గుర్తించడం వల్ల మరణాలు చోటు చేసుకుంటాయని వైద్యులు చెబుతున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య శాఖ సర్వే ప్రకారం క్యాన్సర్ మరణాలు ఎక్కువగా ఉన్నాయని వెల్లడైంది. ఈ మహమ్మారికి కళ్లెం వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. క్యాన్సర్‌కు చెక్ చెప్పాలనే ఉద్దేశంతో గత నెల 14 నుంచి క్యాన్సర్‌పై విజయం–స్క్రీనింగ్‌తో సాధ్యం అనే నినాదంతో ఇంటింటి పరీక్షలు ప్రారంభించారు. తొమ్మిది నెలల పాటు ఈ సర్వే నిర్వహించనున్నారు. ఇంటి వద్దే 18 ఏళ్లు నిండిన వారికి ఆరోగ్య సిబ్బంది ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

- ఇంటింటికీ జల్లెడ పడుతున్న వైద్య సిబ్బంది
- క్యాన్సర్ లక్షణాలపై ఫోకస్
- అనుమానితులకు ప్రత్యేక వైద్య పరీక్షలు
- ఎన్‌సీడీ యాప్‌లో సమస్త వివరాల నమోదు



ఇంటివద్దే బీపీ పరీక్ష చేస్తున్న ఏఎన్‌ఎం

విశాఖ విద్య: క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి కట్టడి చేయడానికి చేపట్టిన ఎన్‌సీడీ సర్వే నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది. బుచ్చిరాజుపాలెం, చంద్రానగర్, లక్ష్మీనగర్, శివనగర్ అర్బన్ ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య సిబ్బంది ఇంటింటినీ సందర్శిస్తున్నారు. క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులను ముందుగానే గుర్తించడం ద్వారా అడ్డుకట్ట వేయవచ్చనే లక్ష్యంతో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తీసుకొచ్చిన ప్రత్యేక యాప్‌లో సమస్త ఆరోగ్యపరమైన విషయాలను వైద్య సిబ్బంది ఆన్‌లైన్ చేస్తున్నారు.

యాప్‌లో వివరాల నమోదు

ఎన్‌సీడీ సర్వే కోసం గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేకంగా 3.0 పేరిట ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. వైద్య సిబ్బంది సేకరించిన వివరాలను ఆ యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఇంట్లో ఉన్న వారి ఆరోగ్యసమస్యలను వైద్య సిబ్బంది అడిగి తెలుసుకొని అక్కడికక్కడే ఆన్‌లైన్ చేస్తున్నారు.

సచివాలయం యూనిట్‌గా..

సచివాలయం యూనిట్‌గా ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలతో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశారు. సర్వే సమయంలో పూర్తి స్థాయిలో వివరాలు సేకరించడానికి వీలుగా సమయం కేటాయించారు. వైద్య సిబ్బంది రోజుకు ఐదు ఇళ్లను మాత్రమే సర్వే చేసేలా ఏర్పాట్లు చేశారు.

సర్వేపై ఫోకస్

దీర్ఘకాలిక వ్యాధులకు అడ్డుకట్ట వేయటమే లక్ష్యంగా వైద్య ఆరోగ్యశాఖాధికారులు ప్రస్తుతం ఎన్‌సీడీ సర్వేపై ఫోకస్ పెట్టారు. సర్వేలో భాగంగా యాప్‌లో ఇప్పటికే అందుబాటులో ఉన్న వివరాలను తాజా సర్వేలో అప్‌డేట్ చేస్తున్నారు. గత సర్వేల్లో వివరాలను పోల్చుతూ ప్రస్తుతం ఆ ఇళ్లలో ఉన్నవారి ఆహారపు అలవాట్లు, ఎవరికైనా రక్త పోటు ఉందా, మధుమేహం వంటి వ్యాధులతో బాధపడుతున్నారా..? హృదయ సంబంధిత వ్యాధులు గతంలో ఎప్పుడైనా సంక్రమించాయా.? ఆస్తమా వంటి సమస్యతో ఎవరైనా ఉన్నారా ఇలా ఆరోగ్య పరమైన సమగ్ర వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నారు.

క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేసేలా

క్యాన్సర్ బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా నగరంలో సైతం క్యాన్సర్ కేసులు గణనీయంగా నమోదవుతున్నాయి. క్యాన్సర్ సంబంధిత వైద్య పరీక్షలు అందుబాటులో లేకపోవటం వీటిపై ప్రజానీకంలో సరైన అవగాహన లేక ఎంతో మంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. దీనికి అడ్డుకట్ట వేసేలా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక దృష్టి సారించారు. సర్వేలో క్యాన్సర్ లక్షణాలు గుర్తించేలా వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలు ఉన్నట్లుగా గుర్తిస్తే అలాంటి వారి వివరాలను యాప్‌లో ప్రత్యేకంగా నమోదు చేస్తున్నారు. అనుమానితులకు మరోమారు యూపీహెచ్‌సీ స్థాయిలో పరీక్షలు చేసిన అనంతరం కేజీహెచ్‌లోని క్యాన్సర్ నిర్ధారణ కేంద్రానికి పంపిస్తున్నారు.



గత ప్రభుత్వ హయాంలో పటిష్ట కార్యాచరణ

ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నేపథ్యంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే పటిష్టమైన కార్యాచరణ రూపొందించారు. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. వ్యాధుల నివారణ కోసం అప్పట్లోనే రెండు దఫాలుగా సర్వే నిర్వహించారు. దీనికి కొనసాగింపుగా 3.0 పేరిట ప్రస్తుతం వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్యపరిస్థితులపై సమగ్ర వివరాలు సేకరిస్తున్నారు.

పక్కాగా సర్వే



సచివాలయం యూనిట్‌గా ఎన్‌సీడీ సర్వే పూర్తి స్థాయిలో జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. వైద్య సిబ్బంది చేస్తున్న సర్వేను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం. క్యాన్సర్ అనుమానితులు ఎవరైనా ఉంటే అలాంటి వారికి ఆస్పత్రిలో మరోమారు పరీక్షలు చేసి కేజీహెచ్‌కు పంపిస్తున్నాం.

– డాక్టర్ రొంగలి రేవతి, బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ

ముందస్తు పరీక్షలతో మేలు



క్యాన్సర్ లక్షణాలను ముందుగానే గుర్తిస్తే నివారణ ఎంతో సులభం. దీనిపై అవగాహన లేక చాలా మంది పరీక్షలు చేయించుకోవడవ లేదు. అలాంటి వారికి క్యాన్సర్ ప్రాణాంతక స్టేజ్‌కు దారితీస్తోంది. ప్రస్తుతం కింగ్ జార్జి ఆస్పత్రిలో క్యాన్సర్ నివారణకు అత్యాధునిక వైద్యం అందుతోంది. క్యాన్సర్ గుర్తింపు పరీక్షలను కూడా విస్తృతంగా చేస్తున్నాం. అనుమానితులు ఎవరైనా ఉంటే నేరుగా కేజీహెచ్‌కు వచ్చి పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ పాండురంగ కుమారి, అంకాలజీ విభాగాధిపతి, కింగ్‌జార్జి ఆస్పత్రి

కనీస వసతుల్లేక కార్మికుల ఆందోళన

- మరుగుదొడ్లకు తాళాలు
- కానరాని విశ్రాంతి షెడ్లు
- ఇబ్బంది పడుతున్న కార్మికులు



సేద తీరేందుకు విశ్రాంతి గది లేకపోవడంతో ఆరుబయట కార్మికులు



అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లు

మల్కాపురం: సంస్థ అభివృద్ధికి పాటుపడే కార్మికులు కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. హెచ్‌పీసీఎల్ విస్తరణ పనులు చేస్తున్న కార్మికులు విశ్రాంతి తీసుకోవడానికి గదులు లేవు. కొన్ని మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. మంచినీటి సదుపాయం, అత్యవసర వైద్యం కోసం వైద్య పరికరాలు, మందులు గానీ అందుబాటులో లేక కార్మికులు విలవిల్లాడుతున్నారు.

ఇదీ పరిస్థితి

హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సంస్థలో రెండేళ్ల నుంచి 23 వేల కోట్ల రూపాయలతో విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను ఎల్‌అండ్‌టీ ఆధ్వర్యంలో రఫ్,పెట్రోఫ్యాక్ ఇలా పలు సంస్థలు పనులు చేపడుతున్నాయి. పనులు చేపట్టే కార్మికులకు సదరు కాంట్రాక్టర్లు కనీస వసతులు కల్పించాల్సి ఉంది. పరిశుభ్రమైన మంచినీరు,శుభ్రతతో కూడిన మరుగుదొడ్లు,భోజన శాల,విశ్రాంతి గది,అత్యవసర వైద్యం కోసం వైద్యులు,సిబ్బంది,మందులు అందుబాటులో ఉండాలి. కానీ ఇక్కడ అలాంటి సౌకర్యాలు ఏవీ కాంట్రాక్టర్లు కల్పించడం లేదు. పొరపాటున కార్మికుడికి గాయాలైతే అత్యవస చికిత్స చేసేందుకు వైద్య సిబ్బంది ఉండరు. గాయపడిన కార్మికుడిని హెచ్‌పీసీఎల్ ఆస్పత్రికో లేదా నగరంలోని ప్రైవేట్ వైద్యశాలకో పంపించాల్సిన పరిస్థితి. తమకు కనీస వసతులు లేకున్నా కార్మిక నాయకులు పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు సమస్యను దష్టిలో పెట్టుకొని వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆచార్య హరినాథ్

విశాఖ విద్య: మత్తు పదార్థాలకు బానిసైతే యువత జీవితం నాశనమవుతుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలల చీఫ్ వార్డెన్ ఆచార్య ఎస్. హరినాథ్ అన్నారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఆదివారం శాతవాహన హాస్టల్ ప్రాంగణంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయూను డ్రగ్స్ రహిత క్యాంపస్‌గా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఉన్నత ఆశయాలతో విశ్వవిద్యాలయంలో అడుగుపెట్టిన ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. ఆరోగ్యకరమైన అలవాట్లు కలిగి ఉంటూ, ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా నిరంతరం శ్రమించాలన్నారు. యువత ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రగ్స్‌కు బానిసలుగా మారకూడదని హితవు పలికారు. వాటి వల్ల ఆరోగ్యం, భవిష్యత్తు నాశనమవుతాయని గుర్తించాలన్నారు. విద్యావంతులైన యువత దేశానికి ఉపయుక్తంగా నిలిచే ఉన్నత మానవ వనరులుగా మారాలని చెప్పారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన బ్యానర్‌లను ప్రదర్శిస్తూ విద్యార్థుల్లో అవగాహన కల్పించారు.

భళా.. విద్యార్థుల చిత్రకళ

ఆకట్టుకుంటున్న ఫైన్ ఆర్ట్స్ ఫెయిర్



విద్యార్థులకు సూచనలిస్తున్న ఏయూ ఆచార్యుడు



ప్రదర్శనలో కళారూపాలను తిలకిస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం చిత్రకళా విభాగం విద్యార్థులు తమ కళా ప్రతిభతో నగరవాసుల మనసులను దోచుకుంటున్నారు. ఫైన్ ఆర్ట్స్ విద్యార్థుల చిత్రకళా ప్రదర్శనకు కళాభిమానులు, నగరవాసుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ సంవత్సరం విద్యార్థులు తమ ప్రతిభతో తయారు చేసిన చిత్రాలను ప్రదర్శించడంతోపాటు వాటి విక్రయాలను సైతం ఏర్పాటు చేశారు. ఈ కళాఖండాలను నగరవాసులు ఎంతో ముచ్చటపడి కొనుగోలు చేస్తున్నారు. నాణ్యమైన కళారూపాలు తక్కువ ధరకే ఇక్కడ లభిస్తూ ఉండటంతో నగరవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శని, ఆదివారాల్లో విక్రయాలు గణనీయంగా జరిగాయి. దీంతో విద్యార్థులు మరికొన్ని చిత్రాలు, శిల్పాలను తయారు చేసే పనిలో నిమగ్నమవుతున్నారు. ఇంట్లో అలంకరణకు, బహుమతులుగా ఇవ్వడానికి విద్యార్థులు చేసిన కళాఖండాలు, వర్ణ చిత్రాలు ఎంతో అనువుగా ఉంటున్నాయి. దీంతో పెద్ద సంఖ్యలో నగరవాసులు వచ్చి వీటిని తిలకించి తమకు నచ్చిన వాటిని కొని తీసుకెళ్తున్నారు. ఈ నెల 29 వరకు చిత్రకళా ప్రదర్శన కొనసాగుతుందని, ఉద యం 10 నుంచి సాయంత్రం 7 వరకు శివాజీపాలెంలోని ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఈ ప్రదర్శన ఉంటుందని విభాగాధిపతి డి.సింహాచలం తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు బాజీ జంక్షన్ వద్ద నివాసముంటున్న బంగారమ్మ కుటుంబాన్ని ఎమ్మెల్యే గణబాబు పరామర్శించారు. ఇటీవలకురిసిన వర్షానికి ఆమె కుటుంబం నివాసముంటున్న పెంకుటిల్లు కూలిపోయింది. దీంతో ఆమె ఇబ్బందులు పడుతుందని విషయం తెలుసుకున్న ఆయన ఆదివారం వెళ్లారు. ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మడి రమణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మరీ ఇంత నిర్లక్ష్యమా!

- రోడ్లపై భవన నిర్మాణ సామగ్రి
- ప్రమాదాల బారిన ద్విచక్ర వాహదారులు, పాదచారులు
- పట్టించుకోని అధికారులు



ఊర్వశికూడలి నుంచి గౌరీనగర్‌కు వెళ్లే రోడ్డుకు అడ్డంగా కాంక్రీటు పిక్క



గౌరీనగర్ నుంచి సుభాష్‌నగర్‌కు వెళ్లే రోడ్డులో ..

కంచరపాలెం: జీవీఎంసీ 57 వార్డు ఉర్వశికూడలి పరిధిలోని పలు ప్రాంతాల్లో రహదారికి అడ్డంగా భవన నిర్మాణ సామగ్రి వేస్తుండడంతో రాకపోకలకు ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గౌరీనగర్, సుభాష్‌నగర్, తుమ్మడపాలెం తదితర ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. టీడీపీ నాయకుల అండదండలతో కొంత మంది రోడ్డుకు అడ్డంగా భవన నిర్మాణ సామగ్రి వేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. జోన్–5 టౌన్‌ప్లానింగ్, సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ లోపం వల్ల ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు అడ్డంగా కాంక్రీటు పిక్క, ఇసుక వేయడంతో ద్విచక్ర వాహనదారులు జారిపడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇదేంటని ఎవరైనా ప్రశ్నిస్తే భవన నిర్మాణ యజమానులు, కాంట్రాక్టర్లు ఘర్షణకు దిగుతున్నారు. జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులతో మాట్లాడుకున్నామని దురుసుగా సమాధానాలు ఇస్తున్నారని చెబుతున్నారు.

అధికారులు స్పందించాలి

వార్డులో జరుగుతున్న భవన నిర్మాణ పనులు, జీవీఎంసీ అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సచివాలయ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధుల పేర్లతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అడిగే నాథుడు లేకపోవడంతో రోడ్డుకు అడ్డంగా నిర్మాణ సామగ్రి వేస్తున్నారు. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు జారి పడుతున్నారు. జోన్–5 ఇంజినీరింగ్ అధికారులు స్పందించాలి.

– వై.శ్రీనివాసరావు, గౌరీనగర్, ఊర్వశికూడలి.

ఆస్పత్రి సిబ్బంది తీరుపై రోగి బంధువుల ఆగ్రహం



ఆస్పత్రిలో ఆందోళన చేస్తున్న రోగి బంధువులు

అల్లిపురం : ఓ ప్రైవేట్ ఆస్పత్రి సిబ్బంది మోట తీరు సరిగా లేదంటూ రోగి బంధువులు ఆదివారం సాయంత్రం ఆందోళనకు దిగారు. బుచ్చిరాజుపాలేనికి చెందిన పి.ఎల్లయ్య రైల్వేలో పనిచేసి రిటైర్ అయ్యారు. అనారోగ్యం కారణంగా రైల్వే ఆస్పత్రికి వెళ్లగా.. జగదాంబ దరి ఇండస్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఆస్పత్రిలో చేర్పించినప్పటి నుంచి వైద్యం అందించడం లేదంటూ రోగి బంధువులు సిబ్బందిని ప్రశ్నించారు. ఆస్పత్రి రిసెప్షన్ సిబ్బంది '78 సంవత్సరాల వ్యక్తి కదా.. చనిపోకపోతే ఏమవుతుంది' అనడంతో బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటప్పుడు వైద్యం అందించడం ఎందుకు.. డిశ్చార్జ్ చేసేయండని రోగి కుమార్తెలు పైడ కొండా, వెంకటలక్ష్మి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అయితే అతనికి వైద్యం అందిస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. ఈ గొడవపై ఆస్పత్రి సిబ్బంది మహారాణిపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి రోగి బంధువులకు సర్ది చెప్పారు.

రక్తదానంపై అపోహలు వద్దు



రక్తదానం శిబిరంలో పాల్గొన్న అతిథులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డులోని పిలకవానిపాలెం లక్కీ అమర్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి దాతలు స్పందించారు. వైద్యుడు రమేష్‌కుమార్,అమర్ పాఠశాల ప్రిన్సిపాల్ వాసుదేవరావు శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు ఆర్నెల్లకు ఒక్కసారైనా రక్తదానం చేయాలన్నారు.మనం ఇచ్చే రక్తం మరొకరి ప్రాణం నిలబెడుతుందన్నారు. శిబిరంలో సుమారు 100 యూనిట్ల రక్తం సేకరించారు. వందేభారత్ బ్లడ్ బ్యాంకు అధినేత వినోద్‌బాలు, విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు పరుశురామ్, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు గులిగిందల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యూత్ క్రిస్మస్



పాటలు పాడుతున్న యువతులు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు బుచ్చిరాజుపాలెం జయప్రకాష్‌నగర్‌లోపి ఎరుసలేమ్ ప్రార్థనా మందిరంలో ఆదివారం సాయంత్రం యూత్ క్రిస్మస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిస్టర్ పీస్ ఏంజెల్ బ్లెస్సీ యూత్‌సభ్యులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న రెవరెండ్ డాక్టర్ గ్రేస్‌రాజు క్రీస్తు జీవిత చరిత్రను వివరించారు. యూత్ సభ్యులు ప్రదర్శించిన దృశ్య రూపకాలు, పాటలు అలరించాయి.

కేజీహెచ్‌లో మందుబాబుల వీరంగం

- ఆక్సిజన్ ట్యాంక్ పైపు కట్ చేసేందుకు ప్రయత్నం
- ముగ్గురిని పోలీసులకు అప్పగించిన సెక్యూరిటీ

మహారాణిపేట: కేజీహెచ్‌లో మందుబాబులు వీరంగం సృష్టిస్తున్నారు. సిబ్బంది తరఫున కొందరు వ్యక్తులు అనధికారికంగా విధులు నిర్వర్తిస్తూ రోగులను, వారి బంధువులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. శనివారం రాత్రి ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించి ఆక్సిజన్ ట్యాంక్ పైపులను కత్తిరించడానికి ప్రయత్నించారు. ఇది గమనించిన సెక్యూరిటీ సిబ్బంది వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై విచారణ చేపడుతున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఒకవేళ పైపులు కట్ చేసి ఉంటే ఆస్పత్రికి ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయేది. అంతేకాకుండా వీరు రోగులు, వారి బంధువుల నుంచి పర్సులు, సెల్ ఫోన్లు, ఆభరణాలతో పాటు ఆస్పత్రి ఆస్తులను కూడా దొంగిలిస్తున్నారు. పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాల టైర్లు, ఇతర పరికరాలను చోరీ చేస్తున్నారు. బైక్‌లను కూడా దొంగిలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు కానీ, కేజీహెచ్ అధికారులు కానీ పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.